క్లుప్తంగా

కనుల పండువగా పెద్ద రథోత్సవం



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి, చక్ర తీర్థం, శ్రీ పుష్పయాగం, సప్తావరణం, ద్వాదశారాధన కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి ఆలయం నుంచి ఆర్‌కేపురం వరకు పెద్ద రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా కల్ప వృక్ష వాహన సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, కమిటీ సభ్యులు గంప జగన్, అంజయ్య గుప్తా, అరుణ్, బాలగోపాల్, చిలుక ఉపేందర్‌రెడ్డి, రవీందర్, దాచేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాట్ పరీక్షలో లోటస్‌ల్యాప్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పాఠశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి

చైతన్యపురి: దేశస్థాయిలో ఇటీవల జరిగిన నాట్ పోటీ పరీక్షలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని దిల్‌సుఖ్‌నగర్ లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ లయన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపారు. మొదటి రౌండ్‌లో 225 మంది, రెండవ రౌండ్‌లో 26 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంక్‌లు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న మానసిక ఒత్తిడిని దూరం చేసి వారిని నైపుణ్యాత్మకమైన పరీక్షలో రాణించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లీనా వారణాసి, వైస్ ప్రిన్సిపల్ మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.


అనాథ విద్యార్థి గృహానికి రూ.50 వేల ఆర్థిక సాయం



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ డివిజన్ పోచమ్మ బాగ్‌కు చెందిన ఎస్‌ఎస్‌ఆర్ రెసిడెన్సీ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి రూ.50 వేల ఆర్థిక సాయం చేశారు. విద్యార్థులకు నెల రోజులకు సరిపడే బియ్యం, ఇతర నిత్యావసరాల కొనుగోలు కోసం ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో గృహం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, అనాథ విద్యార్థి గృహం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనాథ, నిరుపేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించి వారి భవిష్యత్‌కు కృషి చేస్తున్నదని కొనియాడారు. కార్యక్రమంలో రెసిడెన్సీ ప్రముఖులు వి.జితేంద్ర, నాగార్జున రెడ్డి, డాక్టర్ ఎస్‌వీ రంగనాయకులు పాల్గొన్నారు. ఆర్థిక సాయం చేసిన ఎస్‌ఎస్‌ఆర్ రెసిడెన్సీ ప్రతినిధులకు గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

నా భర్త ఆచూకీ కనుగొనండి

- పోలీసులను వేడుకున్న అదృశ్యమైన వ్యక్తి భార్య



అదృశ్యమైన నర్సింహ

హస్తినాపురం: ఇంటి నుంచి బయటికి వెళ్లిన తన భర్త అదృశ్యమై నెలరోజులు గడుస్తున్నా పోలీసులు అతడి ఆచూకీ కనుగొనలేదని భార్య మక్కల సంతోష ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ, గతనెల 31న తన భర్త నర్సింహ అదృశ్యమయ్యాడని తాను వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారని చెప్పింది. గత 27 రోజుల నుంచీ తాను వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతుంటే ఎస్‌ఐ జగన్ సరైన సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. నర్సింహ మిస్సింగ్ కేసు హెడ్ కానిస్టేబుల్ వీరయ్యకు అప్పజెప్పామని చెప్పాడని, అతడి సమాధానంతో సంతృప్తి చెందని తాను కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డిని కలిశానని తెలిపింది. అదృశ్యమైన తన భర్తను ప్రాణాలతోనైనా.. లేదంటే శవాన్నైనా అప్పగించాలని వేడుకున్నానని, స్పందించిన సీఐ.. ఎస్‌ఐను పిలిపించి అదృశ్యమైన నర్సింహ ఫొటోతో అన్ని ప్రాంతాలకు లుక్‌ఔట్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారని చెప్పింది. రెండు రోజుల్లో అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సీఐ జలేందర్ రెడ్డి ఎస్‌ఐ జగన్‌ను ఆదేశించారని తెలిపింది. వెంటనే తన భర్త ఆచూకీని తెలుసుకోవాలని పోలీసులను సంతోష విజ్ఞప్తి చేసింది.

మూసీ పరీవాహకం.. దోమల ఆవాసం



బండ్లగూడ చెరువు వద్ద పేరుకపోయిన చెత్తాచెదారం



దోమలకు నిలయంగా మారిన బండ్లగూడ చెరువు డ్రైనేజీ నీరు

- సాయంత్రం 6 అయితే చాలు కాలనీలపై దోమల దండయాత్ర
- ఫాగింగ్‌పై అధికారుల నిర్లక్ష్యం
- దోమ కాటుతో అనారోగ్యం పాలవుతున్న జనం



నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట, నాగోలు డివిజన్లతో పాటు పలు ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల కారణంగా కంటిపై కునుకు పట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. దోమకాటుకు గురై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మూసీ పరివాహక ప్రాంతమైన కొత్తపేట డివిజన్ పరిధిలోని సత్యనగర్, న్యూ మారుతీనగర్, విద్యుత్‌నగర్, జనప్రియ క్వార్టర్స్, సమతాపురి కాలనీ, నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ, మమతానగర్, సాయిరాంనగర్, వెంకటరమణ కాలనీ, బండ్లగూడ చెరువు పరిసర ప్రాంత కాలనీలు, ఫతుల్లాగూడ పరిసర ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. బండ్లగూడ చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారంలోను, చెరువులోని డ్రైనేజీ నీటిలోను దోమలు ఎక్కువగా పుట్టుకొస్తున్నాయి.
- సాయంత్రం 6 గంటలైతే చాలు దోమలు విజృంభిస్తున్నాయని, ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంటోందని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.
- కొద్దిసేపు పార్కుల్లో సేద తీరుదామనుకుంటే దోమల కారణంగా అక్కడ కూడా ఎక్కువసేపు ఉండలేకపోతున్నామని వయోవృద్ధులు, మహిళలు, పిల్లలు చెప్తున్నారు.
- దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, సాయంత్రం వేళల్లో అధికారులు ఒక్కసారి కాలనీలకు వచ్చి చూస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతుందని అంటున్నారు.
- దోమలు నివారణకు జీహెచ్‌ఎంసీలో ఎంటమాలజీ విభాగం ఉన్నప్పటికీ అది పని చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.
- దోమకాటు కారణంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నప్పటికీ ఎంటమాలజీ అధికారులు ఫాగింగ్‌పై దృష్టి పెట్టడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- విష జ్వరాలతో పాటు చర్మంపై దద్దుర్లు రావడం వంటి సమస్యతో బాధపడుతున్నామని చెబుతున్నారు.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలనీలో ఉండలేకపోతున్నాం



సాయంత్రం సమయంలో దోమల బెడద ఎక్కువగా ఉండటంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. కొత్తపేట మూసీ పరీవాహక ప్రాంత కాలనీవాసులు దోమల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– కొత్త తిరుమల్, మోహన్‌నగర్

ఫాగింగ్ చేయడం లేదు



నాగోలు డివిజన్ పరిధిలోని మమతానగర్, మల్లికార్జుననగర్, జైపురికాలనీ తదితర కాలనీల్లో దోమలు విజృంభిస్తున్నాయి. ఎంటమాలజీ విభాగం అధికారులు ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు వృద్ధి చెంది కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాస్, బండ్లగూడ

వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి



వరదనీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీ నగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ గౌతమినగర్ కాలనీలో నెలకొన్న వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హామీ ఇచ్చారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన సర్కిల్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి రహదారులపై నిలిచిన వరదనీటిని పరిశీలించారు. వెంటనే స్పందించిన లచ్చిరెడ్డి సంబంధిత సిబ్బందిని కాలనీకి రప్పించి వరదనీటి సమస్యను తాత్కాలికంగా పరిష్కరింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కాలనీలో త్వరలో నాలా పూడికతీత పనులు ప్రారంభించటంతో పాటు అవసరమైన చోట నాలా విస్తరణ పనులు కూడా చేపడతామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రమణమూర్తి, శ్రీకాంత్, సుధాకర్, రాంగోపాల్, సర్కిల్ అధికారులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఫంక్షన్‌హాల్ పెండింగ్ పనులు ప్రారంభం



మినీ ఫంక్షన్‌హాల్ పెండిగ్ పనులను పరిశీలిస్తున్న రఘుమారెడ్డితో రాజిరెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని సుల్తానా అల్వా కాలనీలో అసంపూర్తిగా ఉన్న మినీ ఫంక్షన్‌హాల్ పనులను రూ. 84 లక్షలతో పూర్తి చేస్తామని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లా రఘుమారెడ్డి అన్నారు. బుధవారం ఆయన డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డితో కలిసి అసంపూర్తిగా ఉన్న ఫంక్షన్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక కృషి వల్ల ఫంక్షన్ హాల్ పనులు పూర్తి చేసేందుకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో ఈ పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉమామహేశ్వర్, సామ రంగారెడ్డి, నర్సింహ, సత్యనారాయణ, నర్సింగరావు, గణేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ, రహదారి సమస్యలను పరిష్కరించండి



మధురాపురి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, రహదారి సమస్యలను పరిష్కరించాలని గడ్డిఅన్నారం డివిజన్ మధురాపురి కాలనీవాసులు కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డిని కోరారు. జీహెచ్‌ఎంసీ ఇంటెన్సివ్ శానిటేషన్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇంట్రాక్షన్ కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి కార్పొరేటర్ కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చాలా కాలం క్రితం వేసిన డ్రైనేజీ లైన్ పెరిగిన జనాభాకు సరిపోవటం లేదన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీ పొంగి రోడ్లపై మురుగునీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నదని చెప్పారు. అలాగే, పాడైపోయిన అంతర్గత రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కాలనీలోని సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు యాదయ్య, శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, కాలనీవాసులు సత్యనారాయణ, నర్సింహగుప్తా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్గత రహదారులనూ ఆధునీకరిస్తాం



ఎస్‌బీహెచ్ కాలనీలో వీడీసీసీ రహదారిని ప్రారంభించిన కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారులు సైతం ఆధునీకరిస్తామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ కాలనీ, ఆస్మాన్‌ఘడ్, గౌతం మోడల్ స్కూల్‌ల వద్ద నూతనంగా నిర్మించిన వీడీసీసీ రహదారులను కార్పొరేటర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సైదాబాద్‌లో పలు ప్రాంతాల్లో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు సాగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో పనులు పూర్తయిన తర్వాత అక్కడ కూడా రహదారులను నూతనంగా నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీతామహాలక్ష్మి, మంజులారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తున్నా: కొప్పుల



గణేష్‌నగర్ కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న ప్రతి సమస్యనూ అవగాహన చేసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి గణేష్‌నగర్ కాలనీ ఫేజ్–2 కాలనీలో బుధవారం పర్యటించి కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యలున్నాయని, సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు సంజీవరెడ్డి, నర్సింహ, విజయ్, పర్వత్‌రెడ్డి, ఓంకార్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివంహిల్స్ కాలనీలో రూ.13 లక్షలతో నూతన డ్రైనేజీ

డివిజన్ హయత్‌నగర్ పరిధి శివంహిల్స్ కాలనీలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలోని రోడ్ నంబర్–14లో నూతన డ్రైనేజీ పనులకు రూ.13లక్షల నిధులు మంజూరు చేయించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు సత్యనారాయణ, రాధాకృష్ణ రెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు కడారి యాదగిరి యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి: రాంరెడ్డి



హస్తినాపురం ఈస్ట్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ హయాంలో రోడ్లు వేసి అభివృద్ధి చేస్తే కనీసం ఆ రోడ్లకు మరమ్మతులు చేయలేని దీనస్థితిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నరసింహాయాదవ్ ఆధ్వర్యంలో వనస్థలిపురం డివిజన్‌లో నిర్వహించనున్న హాథ్ సే హాథ్ జోడోయాత్రను బుధవారం హస్తినాపురం ఈస్ట్ చౌరస్తా నుంచి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారి అటు పార్టీకి, ఇటు నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేసిన ఘనత ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిది అని అన్నారు. మంగళవారం కురిసిన వర్షానికి పలు కాలనీలు జలమయం అయ్యాయని, మరి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రణలోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మక్సూద్, మధు, మోహన్‌రెడ్డి, సదాశివుడు, శ్రీపాల్ రెడ్డి, శ్రీనివాసరావు, కిశోర్‌గౌడ్, సురేందర్ రెడ్డి, గణేష్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మతిన్, రమేష్, రాజశేఖర్, నాగేశ్వర్‌రావు, భాను, మంజులారెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఐఎస్‌సదన్ అభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి, అధికారులు

సైదాబాద్: ప్రణాళికాబద్ధంగా ఐఎస్‌సదన్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వివిధ శాఖల అధికారులు, కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కాలనీలో తరచూ అనధికారికంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, దాంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారని కాలనీవాసులు తెలిపారు. కాలనీలో ధ్వంసమైన రోడ్లను ఆధునీకరించాలని, దెబ్బతిన్న మ్యాన్‌హోల్ కవర్లను మార్చాలని కాలనీవాసులు కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, స్థానికులు తెలిపిన సమస్యలపై అధికారులతో చర్చించి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.సమావేశంలో డీపీఓ రత్నమ్మ, ఏఈ అన్సారీ, మినాజ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా



లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం గడ్డిఅన్నారంలోని తన కార్యాలయంలో ఆయన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయన్నారు. సరూర్‌నగర్, ఉప్పల్ మండలాలకు చెందిన 185 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వారం రోజుల్లో తాగునీటి సదుపాయం



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్: డివిజన్‌లోని పద్మాలయ కాలనీ, సూర్యానగర్ ఈస్ట్ కాలనీలకు వారం రోజుల్లో తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, ఇందుకు సంబంధిన పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభిస్తామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పైప్‌లైన్ నిర్మాణం కోసం జలమండలి అధికారులతో కలిసి లెవల్స్(గ్రావిటీ)ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... గ్రేటర్‌కు చివరలో ఉన్న ఈ కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారి రాజు, సూపర్‌వైజర్ రాజు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



ఓల్డ్‌మలక్‌పేటలో పర్యటిస్తున్న షఫీయుద్దీన్

చాదర్‌ఘాట్: ఓల్డ్ మలక్‌పేట సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీయుద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. పద్మానగర్ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు, ఫుట్‌పాత్ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారి ప్రదీప్‌కుమార్, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 11, వంకాయ 15, బెండ 23, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 20. దొండ 23, ఆలు 21, ఉల్లి 14, గోకర 35, దోస 15, సొర 09, పొట్ల 13, చిక్కుడు 55.